రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ వినీత్

డీసీపీ ఆకస్మిక తనిఖీ

రామచంద్రాపురం, నవంబర్ 7: ఆర్సీపురం పోలీస్‌స్టేషన్‌ను మాదాపూర్ డీసీపీ వినీత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ మేనేజ్‌మెంట్, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. లాఅండ్‌ఆర్డర్‌ని సక్రమంగా మెయింటెన్ చేయాలని సూచించారు. పాత నేరస్తులు, అనుమానితులపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలతోపాటు మిగతా గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సైబరాబాద్ పోలీసింగ్ 24/7 పని చేస్తుందని తెలిపారు. నిరంతరం కాలనీల్లో పోలీసుల గస్తీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నర్సింహరావు, ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు ఆహ్వానం

హత్నూర, నవంబర్ 7: మండలంలోని గుండ్లమాచునూర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో బోధించుటకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 11లోపు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

జహీరాబాద్, నవంబర్ 7: 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని మొగుడంపల్లి తహసీల్దార్ హసీనాబేగం గురువారం ప్రకటనలో కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 9, 10వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1 జనవరి 2025 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఫారం-6లో, మార్పులు, చేర్పులకు ఫారం-8లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శివంపేట శ్రీ సాయి వీరభద్ర రైస్ మిల్లుపై కేసు

చౌటకూర్, నవంబర్ 7: మండలంలోని శివంపేటలోని శ్రీ సాయి వీరభద్ర రైస్‌మిల్లుపై తూనికలు, కొలతల శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం శివంపేట రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని నెలల క్రితం ధర్మకాంటా కాలపరిమితి ముగిసిందని, అయినప్పటికీ, అదే కాంటా పై తూకం వేయడంతో కేసు నమోదు చేశారు. రైస్‌మిల్లులోని 300 కేజీల చిన్న కాంటాలను కూడా పరిశీలించారు. రెన్యూవల్ చేసుకునేంత వరకు కాంటా చేయకూడదని యాజమాన్యాన్ని ఆదేశించారు.

21 నుంచి జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 7: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో డీఈవో మాట్లాడుతూ స్థానిక శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసేందుకు 11 కమిటీలను ఏర్పాటు చేసి, 11 మంది కన్వీనర్లు, కో-కన్వీనర్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాభాయి, జిల్లా సైన్స్ అధికారి సిధారెడ్డి, మాజీ జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈవోలు విద్యాసాగర్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నారాయణఖేడ్, నవంబర్ 7: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ గురువారం తెలిపారు. నారాయణఖేడ్ మండలం అబ్బెంద శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా కిషన్‌నాయక్ తండాకు చెందిన గోపాల్ బైక్‌పై వస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆయన వద్ద సోదా చేయగా 1.102 కిలోల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. ఈ విషయమై నిందితుడిని విచారించగా జీవన్ అనే వ్యక్తి వద్ద రూ.10 వేలకు కొనుగోలు చేసినట్లు తేలిందని పేర్కొన్నారు. గంజాయితో పాటు నిందితుడి సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఎస్ఐ అనుదీప్, సిబ్బంది అంజిరెడ్డి, ఆసిఫ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

మల్కాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కొండాపూర్, నవంబర్ 7: కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం మండలంలోని మల్కాపూర్‌లో పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, తొగర్‌పల్లిలో జరుగుతున్న కులగణనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్న రకం, దొడ్డు రకానికి వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, ఎంపీడీవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

సదాశివపేట, నవంబర్ 7: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని 25వ వార్డులో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, వృత్తిపరమైన, కుల గణనపై సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సర్వేలో ఇండ్ల జాబితా ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,400 పైచిలుకు ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సదాశివపేటలో 94 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు చెప్పారు. పట్టణాన్ని 94 బ్లాకులుగా విభజించి ప్రతి బ్లాకుకు ఒక ఎన్యూమరేటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రెండు మూడు రోజులు అధికారులు ప్రతి ఇంటికీ స్టిక్కర్ అతికిస్తారని పేర్కొన్నారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ముద్రించిన ఫార్మాట్‌లో కుటుంబ వివరాలు సేకరిస్తారన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎటువంటి అపోహలు లేకుండా వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, మున్సిపల్ కమిషనర్ ఉమ పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రం పరిశీలన

మండల పరిధిలోని ఆత్మకూర్ శివారులోని శ్రీ వెంకటేశ్వర కాటన్ మిల్‌లో సీసీఐ పత్తి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిల్లు యాజమాన్యం రైతులకు సరైన ధర చెల్లించాలని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, తహసీల్దార్ సరస్వతి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

జిన్నారం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

జిన్నారం, నవంబర్ 7: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరించాలని అదనపు కలెక్టర్ మాధురి నిర్వాహకులకు సూచించారు. గురువారం జిన్నారం, ఊట్ల, వావిలాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం సేకరణ తీరును పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద రైతులు పలు సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. అడిషన్ కలెక్టర్‌తోపాటు తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, సర్వేయర్ రామభద్ర ఉన్నారు.

వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే తరలించాలి

గుమ్మడిదల, నవంబర్ 7: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ గంగాభవాని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంఏవో శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో లచ్చిరాంనాయక్ ఉన్నారు.

ఉచితంగా న్యాయ సేవలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 7: ఉచితంగా న్యాయ సేవలు పొందడానికి టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ కోరారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారంతో విద్యార్థులకు న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల: బొంతపల్లిలో ఛట్‌పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా ఛట్ పూజలు

గుమ్మడిదల, నవంబర్ 7: ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రజలు ఛట్ పూజలను బొంతపల్లిలో కనులపండువగా నిర్వహించారు. గురువారం మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో పొరుగురాష్ట్రాల నుంచి వలస వచ్చి జీవనం సాగిస్తున్న భక్తులు ఛట్ పూజలను వైభవంగా నిర్వహించారు. బొంతపల్లిలో ఏర్పాటు చేసిన కొలనులో పొరుగు రాష్ట్రాల ప్రజలు ఛాటలో పూజా సామగ్రితో సూర్యదేవునికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌గౌడ్, గోపాల్, మడపతి గణేశ్, గటాటి రమేశ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో ఘనంగా ఛట్ పూజలు

బొల్లారం నవంబర్ 7: బొల్లారం పారిశ్రామికవాడలోని బతుకమ్మ ఘాట్, పోచమ్మ బస్తీలోని సూర్య భగవాన్ ఆలయంలో ఛట్ పూజలను ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, స్థానిక సీఐ గంగాధర్ హాజరయ్యారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల మహిళలతో కలిసి సూర్య భగవానుడి ప్రాంగణంలోని నీటి గుండం వద్ద కౌన్సిలర్ చంద్రారెడ్డి, బతుకమ్మ ఘాట్ వద్ద బాల్‌రెడ్డి వేర్వేరుగా ఛట్ పూజలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు బాలాజీ నగర్‌లో ఉత్తరాది రాష్ట్రాల మహిళలకు ఛట్ పూజల సందర్భంగా కౌన్సిలర్ గుండ్ల సుజాతామహేందర్ రెడ్డి దంపతులు చెరుకు గడలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గోపాలమ్మ, చంద్రయ్య, నరసింహారాజు, కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, రత్నం, ఆనంద్ కృష్ణారెడ్డి, జైపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు దీననాథ్ పాల్గొన్నారు.

సూర్య భగవాన్ ఆలయంలో ఛట్ పూజలు జరుపుకొంటున్న ఒడిశా, బీహార్ వాసులు

పరిస్థితి విషమించి ప్రిన్సిపాల్ మృతి

అర్చన(ఫైల్)

మునిపల్లి, నవంబర్ 7: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మునిపల్లి మండలం బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన మృతి చెందినట్లు ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ అర్చన బుధవారం సాయంత్రం కళాశాలలో విధులు ముగించుకొని కారులో తోటి ప్రొఫెసర్‌తో కలిసి క్యాంపస్‌కు వెళ్తున్న క్రమంలో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో ప్రిన్సిపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తోటి అధ్యాపకులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిటిజెన్ దవాఖానకు తరలించి అక్కడ చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. ప్రమాద సమయంలో తోటి ప్రొఫెసర్ చేతికి స్వల్ప గాయమైనట్లు తెలిపారు. కళాశాల ఆవరణలో విద్యార్థుల కళ్లముందే ప్రిన్సిపాల్ అర్చనకు ప్రమాదం జరుగడంతో విద్యార్థులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రిన్సిపాల్ అర్చనకు కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రిన్సిపాల్ మృతితో ఉన్నతాధికారులు కళాశాలకు సెలవు ప్రకటించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబర్ 7: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని హుగ్గెల్లికి సతీశ్‌కుమార్‌కు రూ.34వేలు, న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి)కి చెందిన ముకీం ఆహ్మద్‌కు రూ.12 వేల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, దత్తరెడ్డి, ఇమ్రాన్, చిన్నారెడ్డి, విజయ్‌రాథోడ్, మోహన్‌రాథోడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలకు కత్తెర పెట్టడానికే సర్వే

మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం కులగణన పేరుతో వ్యక్తిగత, ఆస్తుల వివరాలు, పొంతన లేని ప్రశ్నలు, రాజకీయ, సామాజిక అంశాలతో సర్వే చేయడం సరైంది కాదని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందకుండా చేయడానికే వ్యక్తిగత ఆస్తుల వివరాలు, రాజకీయ, సామాజిక వివరాలు సేకరిస్తున్నారన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. సర్వేలో కేవలం కులాలకు సంబంధించిన ప్రశ్నలే ఉండేలా చూసుకోవాలన్నారు. కులగణన ఆధారంగానే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, నాయకులు ఆకుల సత్యనారాయణ, మంద భాస్కర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, అంబర్‌పేట మహిపాల్‌రెడ్డి, సూర్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, ఆయూబ్, ఎండీ గౌస్, మేకల రవి, బీరప్ప, రాజు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తేవాలి

నారాయణఖేడ్, నవంబర్ 7: హమాలీల సంక్షేమానికి చట్టం తేవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి కోరారు. గురువారం నారాయణఖేడ్‌లో మాట్లాడుతూ ప్రభుత్వం హమాలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. హమాలీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వయస్సును బట్టి పెన్షన్లు వర్తింపజేయాలని, కార్మికులు ప్రమాదాలకు గురైన పక్షంలో వారిని ఆదుకునేందుకు ప్రత్యేక నిధి కేటాయించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో హమాలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, వెంకట్, సాయిలు, లక్ష్మయ్య, పోచయ్య, సంగమేశ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇవ్వాలి

రాయికోడ్, నవంబర్ 7: ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి దశరథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిమ్నాపూర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవరకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. లేని యెడల ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు అశోక్, కరుణకుమార్, నవీన్ కుమార్, సుధాకర్, రాజు, ప్రదీప్, శాంతయ్య, ఇస్మాయిల్, అమృత్ ఉన్నారు.

రాంకీపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం, నవంబర్ 7: గడ్డపోతారం పారిశ్రామికవాడలోని రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ నిబంధనలు పాటించకుండా కాలుష్యానికి కారణమవుతున్నదని గ్రామస్తులు పీసీబీ మెంబర్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు, జల కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై విచారణ జరిపి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బాలయ్య, ఎన్.శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పీసీబీ ఎంఎస్‌ను కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, నవంబర్ 7: కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆర్సీపురం డివిజన్‌లోని మయూరీనగర్, శ్రీసాయినగర్‌కాలనీల్లో రూ.61.50లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేశ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు డివిజన్‌ల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఆర్సీపురం డివిజన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ నరేందర్, ఏఈ ప్రభు, కాలనీవాసులు మాధవరెడ్డి, శంకర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాజగౌడ్, వీరిశెట్టి, గోవర్ధన్ రెడ్డి, విఠల్‌రెడ్డి, ఐలేశ్, శ్రీరాములు ఉన్నారు.

ముగిసిన హాకీ పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 7: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు గురువారం ముగిశాయి. అండర్-17 బాలుర హాకీ పోటీల ముగింపు వేడుకల్లో డీఈవో వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అమూల్యమ్మ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి హాకీ జట్లు పోటీల్లో పాల్గొన్నాయని, ఇందులో ఆదిలాబాద్ జట్టు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో నల్గొండ, మూడో స్థానంలో మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగా ఫౌండేషన్ డైరెక్టర్ ఉషాకిరణ్, హోప్ న్యూరో ఎండీ డాక్టర్ కృష్ణమూర్తి, పీడీలు విఠల్ గౌడ్, రాజాగౌడ్, సుభాష్ గౌడ్, రామకృష్ణ, షర్ఫోద్దీన్, శ్రీనివాస్ గౌడ్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

జహీరాబాద్, నవంబర్ 7: భూసార పరీక్షలతో పంటల దిగుబడిని పెంచుకోవచ్చని జహీరాబాద్ మండలం దిడ్గి డెక్కన్ డెవలప్‌మెంట్- కృషి విజ్ఞాన కేంద్రం భూసార నిపుణుడు డాక్టర్ స్వామి అన్నారు. గురువారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో భూసార పరీక్షలు, లింగాకర్షక బుట్టల ప్రదర్శనపై భూసార నిపుణుడు, మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తమ పొలంలో అధిక దిగుబడులు పొందాలన్నా.. రసాయన ఎరువులు తగ్గించాలన్నా.. ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పంటలో పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

శనగ విత్తనాలు పంపిణీ

జహీరాబాద్, నవంబర్ 7: శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు భిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని రంజోల్ రైతు వేదికలో ప్రయోగాత్మక ప్రదర్శన క్షేత్రాల కోసం ఎన్‌బీఈజీ-49 రకం శనగ విత్తన ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రకం శనగ విత్తనాలు ఎండు తెగుళ్లకు తట్టుకొని అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రయోగాత్మక ప్రదర్శన కోసం సాగు చేసే రైతులు వచ్చే సంవత్సరం మిగిలిన రైతులకు విత్తనాలు నిల్వచేసి పంపిణీ చేయాలన్నారు.


ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

జహీరాబాద్, నవంబర్ 7 : జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 10న జరిగే సదర్ ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు బీఆర్ఎస్ నేతలు, యాదవ సంఘం నాయకులు ఆహ్వానం పలికారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గుండప్ప, నాయకులు పాండు, మల్లు, పవన్, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేత

విద్యార్థులకు స్పోర్ట్స్ యునిఫామ్ అందిస్తున్న యునియన్ ప్రతినిధులు

కొండాపూర్, నవంబర్ 7: తను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలకు ఏదో ఒకటి చేయాలని భావించిన పూర్వ విద్యార్థి బి.ప్రభుదాస్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ యూనియన్ సహకారంతో 165 మంది విద్యార్థులకు రూ.లక్ష పైఖర్చులతో తమిళనాడులో ప్రత్యేకంగా స్పోర్ట్స్ యూనిఫామ్ తయారు చేయించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆటల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందించారు. మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, సొసైటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ శివమోహన్, వెంకన్న, మంజునాథ్, సంతోష్‌రెడ్డి, సాంబశివరావు, నరేష్ గౌడ్వర్తి, నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, టిలక్, ఎంఈవో దశరథ్, హెచ్ఎం ఎలిజబెత్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టాలి

పటాన్‌చెరు, నవంబర్ 7: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టాలని పటాన్‌చెరు డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 21వ శతాబ్దపు నైపుణ్యాలపై రెండు రోజులుగా ఎన్ఐటీ సహకారంతో అందిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ అధ్యాపకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. సైబర్ నేరాలతో పోగొట్టుకున్న డబ్బు రికవరీలో జిల్లా మూడవ స్థానంలో నిలిచిందన్నారు. అపరిచిత లింకులను ఓపెన్ చేయవద్దని, ఉద్యోగ, కేవైసీ తదితర ప్రకటనలను నమ్మి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురి అయ్యామని తెలిసిన వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, ఎన్ఐటీ మేనేజర్ భగవాన్ మురళీ, మహేశ్, రమేశ్ జాదవ్, రాష్ట్రంలోని వివిధ కళాశాలల ధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబర్ 7: మండలంలోని గుండు తండాలో నూతనంగా నిర్మించనున్న సేవాలాల్ మహరాజ్ ఆలయ భూమి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. తండావాసులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి తండాలో భవానీమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాలు నిర్మించడం అభినందనీయమన్నారు. నాయకులు నారాయణనాయక్, సంతోష్, బాబుసింగ్, భీమ్లానాయక్, తారాసింగ్, మోహన్, రాములునాయక్ దేవులానాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్, నవంబర్ 7: కల్హేర్ మండలం ఖానాపూర్ కే తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బాబునాయక్ అకాల మృతి చెందడంతో బాధిత కుటుంబం ఇంటికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు. మృతిగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గోపాల్‌రెడ్డి, పవార్‌సింగ్, తండా వాసులు ఉన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కోహీర్: సర్వే వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కోహీర్, నవంబర్7: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం కోహీర్ మండలంలోని కొత్తూర్(డి), దిగ్వాల్ గ్రామాల్లో చేపట్టిన సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే నిర్వహించే ముందు వందశాతం ఇండ్లకు స్టిక్కర్లను అతికించాలని సూచించారు. ఈ నెల 9 నుంచి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో వినోద్‌కుమార్, కార్యదర్శులు రవి కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్, నవంబర్ 7: ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక, విద్యా, కులగణన పక్కగా చేపట్టాలని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉల్గెర, శంశోద్దీన్‌పూర్, జంబ్గి(కె) గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటి నుంచి సమగ్రమైన వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో ఎంపీవో అంజలీదేవి ఉన్నారు.

నాగల్‌గిద్దలో..

నాగల్‌గిద్ద, నవంబర్ 7: సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా పక్కగా వివరాలు సేకరించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి అన్నారు. గురువారం మండంలోని ఔదత్‌పూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ పాటిల్, గుండేరావ్ పాటిల్, ఎంపీడీవో మహేశ్వర్‌రావ్ ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

జహీరాబాద్, నవంబర్ 7: కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీ సీఈవో మండలంలోని ధనసిరి, మాడ్గి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాల సేకరణ తీరు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, వివరాల నమోదులో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి మహేశ్, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, సర్వే సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.